క్లుప్తంగా

లక్ష్మీవల్లభ అలకారంలో శ్రీవారు



సత్తెనపల్లి: ధనుర్మాసంను పురస్కరించుకొని పట్టణంలోని వడ్డవల్లి రామాలయం, వేంకటేశ్వర స్వామి దేవాలయం, రైల్వే స్టేషన్ రోడ్‌లోని అలివేలు మంగ పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి దేవాలయం, ఐదులాంతర్ల సెంటర్‌లోని రుక్మిణి సత్య భామ సమేత వేణుగోపాల స్వామి దేవాలయం, కట్టమూరివారి వీధిలోని కోదండ రామాలయంలో గురువారం భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వ హించారు. రైల్వే స్టేషన్ రోడ్డులోని అలివేలు మంగ పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి దేవాలయంలో శ్రీవారికి లక్ష్మీ వల్లభ అలంకారం చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామి వారిని దర్శించుకొన్నారు. భక్తులకు ఎలాంటి ఆటంకం కలగకుండా ఆయా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

హోరాహోరీగా 'ఆడుదాం ఆంధ్రా' పోటీలు



సత్తెనపల్లి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'ఆడుదాం ఆంధ్రా' క్రీడల్లో భాగంగా సత్తెనపల్లి మండలం కొమెరపూడి, నందిగామ, ఫణిదం, భృగుబండ గ్రామాల్లో గురువారం ఖోఖో క్రీడా పోటీలు నిర్వహించారు. క్రీడాకారులు ఎవరికి వారు గెలుపు తమదే అన్నట్లుగా క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించారు. క్రీడాకారులకు ఎలాంటి ఆటంకం కలగకుండా సత్తెనపల్లి ఎంపీడీఓ జీవీ సత్యనారాయణ నేతృత్వంలో నోడల్ అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. పలువురు క్రీడాభిమానులు ఖోఖో పోటీలను ఉత్సాహంగా తిలకించారు.

ఇంటింటికీ అయోధ్య రామయ్య అక్షింతలు



సత్తెనపల్లి: అయోధ్య శ్రీ రామమందిరం నుంచి తీసుకువచ్చిన రామయ్య అక్షింతలు పట్టణంలో ఇంటింటికీ నారాయణ సేన నగర సంకీర్తన సభ్యుల ఆధ్వర్యంలో గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నారాయణ సేన నగర్ సంకీర్తన సభ్యులు మాట్లాడుతూ అయోధ్య శ్రీరాముని అక్షింతలు ప్రతి ఇంట్లో అక్షింతల్లో కలుపుకొని ప్రతి శుభకార్యంలో వీటిని వాడే విధంగా చేసుకోవాలని సూచించారు. నారాయణ సేననగర సంకీర్తన సభ్యులు, రామ భక్తులు ఉన్నారు.

అంతర్జాతీయ లూయిబ్రెయిలీ దినోత్సవం



ముప్పాళ్ళ: ముప్పాళ్ళ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని భవిత కేంద్రంలో అంతర్జాతీయ లూయిబ్రెయిలీ దినోత్సవం గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈఓ ఎం.సీతారామిరెడ్డి పాల్గొని లూయిబ్రెయిలీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు స్వీట్లు, బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ప్రత్యేక అవసరాలుగల విద్యార్థులకు ఎంఈఓ రూ.10వేల నగదును విరాళంగా అందించారు. కార్యక్రమంలో ప్రత్యేక అవసరాల కేంద్రం ఉపాధ్యాయుడు పి.అర్జున్, ఎల్.శ్రీనివాసరావు, వీ.రాజేశ్వరి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో పాస్టర్ దుర్మరణం

నాదెండ్ల: రోడ్డు ప్రమాదంలో పాస్టర్ దుర్మరణం చెందిన ఘటన జాతీయ రహదారిపై గణపవరం పాత టీబీ హాస్పిటల్ వద్ద బుధవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. నాదెండ్ల ఎస్సై జె.బలరామ్‌రెడ్డి వివరాల మేరకు.. ప్రకాశం జిల్లా ఒంగోలు పట్టణానికి చెందిన బిరుదు భూపతిరాజు (32) చర్చిలో పాస్టర్‌గా పనిచేస్తున్నాడు. గుంటూరులోని తన మిత్రుడిని కలిసేందుకు ద్విచక్రవాహనంపై వస్తున్నాడు. అర్ధరాత్రి 2 గంటల సమయంలో టీబీ హాస్పిటల్ వద్దకు వచ్చేసరికి గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో.. ప్రమాదానికి గురయ్యాడు. తలకు హెల్మెట్ ఉన్నప్పటికీ తీవ్రగాయాలైన భూపతిరాజు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని చిలకలూరిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించిన పోలీసులు పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం బంధువులకు అప్పగించారు. భార్య బండారు సోనియా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. వీరికి ఏడాదిన్నర వయస్సు గల కుమార్తె ఉంది.

అవ్వాతాతల కళ్లల్లో ఆనందం

- అభివృద్ధి, సంక్షేమ ప్రదాత సీఎం వైఎస్ జగన్
- పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు
- పెదకూరపాడు, 75 త్యాళ్లూరులో వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీ



పెదకూరపాడులో వృద్ధురాలికి పెంచిన పెన్షన్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

పెదకూరపాడు: జీవితంలో ఎన్నోకష్టాలు చూసి అలసిపోయిన బతుకులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ పెన్షన్ కానుకతో భరోసా కల్పించారని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. గురువారం పెదకూరపాడు మండలంలోని పెదకూరపాడు, 75త్యాళ్ళూరు గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి స్వయంగా ఎమ్మెల్యే శంకరరావు వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2019లో ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ పెన్షన్ కానుకను రూ.3వేలకు పెంచారన్నారు. దీంతో అవ్వాతాతల కళ్లలో సంతోషం చూస్తున్నామన్నారు. పెరిగిన పెన్షన్లతో అవ్వాతాతలకు మంచి జరుగుతుందన్నారు. రాష్ట్రాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధి పథంలో నడిపించడంతో పాటు అవినీతి లేకుండా సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు.

పెన్షన్ల పంపిణీలో నాడు–నేడు..

2019లో పెదకూరపాడు మండలంలో కేవలం 1253 మందికి రూ.12.53 లక్షలు మాత్రమే పెన్షన్ అందేదని, కానీ నేడు జనవరి 2024 వచ్చేసరికి అక్షరాల 7962 మంది పెన్షన్ లబ్ధిదారులకు రూ.2.21కోట్లు అందించామన్నారు. పెదకూరపాడు గ్రామంలో రూ.9 కోట్లతో నూతన అభివృద్ధి సామాజిక ఆరోగ్య కేంద్రం, రూ.60 లక్షలతో పెదకూరపాడు-పాటిబండ్ల రోడ్డు, అమరావతి-బెల్లకొండ డబుల్ రోడ్డు, అమరావతి – తుళ్ళూరు డబుల్ రోడ్డు, పెద్ద మద్దూరు హైలెవెల్ బ్రిడ్జి, మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ ఇంటి సిమెంట్ రోడ్డు, పెదకూరపాడు – భీమినేనివారి పాలెం రోడ్డు, మాజీ ఎమ్మెల్యే దత్తత తీసుకున్న కన్నెగండ్ల గ్రామానికి రోడ్డు ఇలా అనేక అభివృద్ధి పనులు చేశామన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధిలో గత టీడీపీ ప్రభుత్వం కనీసం 10శాతం కూడా చేయలేదన్నారు. నాలుగున్నరరేళ్ల చేసిన అభివృద్ధిని చూసి వైఎస్సార్ సీపీని ఆశీర్వదించాలన్నారు. క్రోసూరు మార్కెట్ యార్డు చైర్మన్ ఈదా సాంబిరెడ్డి, ఎంపీపీ బెల్లంకొండ మీరయ్య, వైఎస్ ఎంపీపీ షేక్ చాంద్‌బాషా, పార్టీ మండల కన్వీనర్ షేక్ మస్తాన్ షరీఫ్, పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు నల్లపాటి యోహాన్, సచివాలయాల కన్వీనర్ మాగులూరి అనిల్‌కుమార్, ఎంపీటీసీలు, గ్రామ సర్పంచులు, ఎంపీడీఓ నరసింహారావు , గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాట....

దార్శనికతతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న కృషి వల్ల బాలల భవిష్యత్తుకు బంగారు బాట పడిందని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. గురువారం 75త్యాళ్ళూరు జెడ్పీ పాఠశాలలో 103 మంది విద్యార్థులకు ట్యాబ్‌లను అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకరరావుకు విద్యార్థులు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. ప్రతి విద్యార్థి ఉన్నత శిఖరాలకు చేరాలనేదే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమన్నారు. అదేవిధంగా మండలంలోని కంభంపాడు గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న గ్రామ సచివాలయ పనులను ఎమ్మెల్యే నంబూరు శంకరరావు గురువారం పరిశీలించారు. పనుల్లో నాణ్యతను పరిశీలించారు. రాబోయే 15 రోజుల్లో సచివాలయం పనులు పూర్తి చేసి ప్రారంభించాలన్నారు.

పేదలకిచ్చిన హామీలు నెరవేర్చిన సీఎం జగనన్న

అమరావతి: రాష్ట్రప్రజల ఆర్థిక కష్టాలు తీర్చటానికి, అర్హులైన వారందరికీ పెన్షన్‌ను రూ.3వేలకు పెంచిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహనరెడ్డిదేనని పెదకూరపాడు శాసనసభ్యుడు నంబూరు శంకరరావు అన్నారు. గురువారం అమరావతి సచివాలయం-2 పరిధిలో నిర్వహించిన పెంచిన పింఛన్‌ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. తొలుత పోస్టాఫీస్ సెంటర్‌లో అంగన్‌వాడీ కార్యకర్తల నుంచి వినతిపత్రం స్వీకరించిన అనంతరం పల్లపువీధి శివగంగవీధి, ముస్లింకాలనీ, గోపాల్‌నగర్‌లలో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే శంకరరావు మాట్లాడుతూ కులం, మతం, పార్టీలు చూడకుండా అర్హులందరికీ పెన్షన్‌లు అందజేస్తున్నామన్నారు. ప్రజా సంక్షేమం కోసం నిరంతరం శ్రమిస్తున్న జగనన్నకు మరల మీ అందరి ఆశీర్వాదం కావాలన్నారు. జీడీసీసీ బ్యాంకు డైరెక్టర్ కోట హరిబాబు, జడ్పీ కో–ఆప్షన్ మెంబర్ షేక్ హష్మీ, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు భవిరిశెట్టి హనుమంతరావు, మండల జేసీఎస్ అధ్యక్షుడు నాయుడు రాంబాబు, పార్టీ నాయకులు నంబూరు బాబురావు, మంగిశెట్టి కోటేశ్వరరావు, నిమ్మా విజయసాగరబాబు, ఆళ్ల శ్రీనివాసరెడ్డి, ఆలా లక్ష్మీనారాయణ, విన్నకోట సాంబశివరావు, నండూరి కరుణకుమార్, అమరావతి సర్పంచ్ పాలపర్తి రాజేశ్వరిలతోపాటు కార్యకర్తలు, అభిమానులు, వలంటీర్లు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం..

బెల్లంకొండ: ఆర్థిక పరిస్థితులు ఇబ్బంది కరంగా ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రజారంజక పాలన చేస్తున్నారని ఎంపీపీ చెన్నపరెడ్డి పద్మా వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని పలు గ్రామాలలో పండుగ వాతావరణంలో రూ.3వేలకు పెంచిన వైఎస్సార్ ఆసరా పింఛన్లను ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు పంపిణీ చేశారు. మండలంలోని మాచాయపాలెం, చిట్యాల గ్రామాలలో ఎంపీపీ పద్మా వెంకటేశ్వరరెడ్డి ఇంటింటికీ తిరిగి పింఛన్లను పంపిణీ చేశారు. సర్పంచ్‌లు బాణావతు నరసింహానాయక్, రామనబోయిన ఆదిగోపాలరావు, ఎంపీటీసీ నరసింహానాయక్, నాయకులు చింతారెడ్డి సాయిరెడ్డి, మర్రి ప్రసాదరెడ్డి, గాదె మిల్లు వెంకటరెడ్డి, భూపాల్‌రెడ్డి, కొండెబోయిన శ్రీను, శ్రీనివాసరాజు, ఏసోబు, వివిధ గ్రామాల కార్యదర్శులు పాల్గొన్నారు.



అమరావతిలో వృద్ధురాలికి పింఛన్ నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు



మాచాయపాలెంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ పద్మా వెంకటేశ్వరరెడ్డి

విద్యాభివృద్ధికి సీఎం వైఎస్ జగన్ కృషి

విద్యార్థులకు జగనన్న విద్యాజ్యోతి స్టడీ మెటీరియల్ పంపిణీ

అచ్చంపేట: విద్యాభివృద్ధికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం పాటు పడుతున్నారని జెడ్పీటీసీ సభ్యుడు తుమ్మావిజయభాస్కరరెడ్డి అన్నారు. గురువారం అచ్చంపేట జెడ్పీ పాఠశాలలో పదవతరగతి విద్యార్థులకు జగనన్న విద్యాజ్యోతి స్టడీ మెటీరియల్, ఎనిమిదో తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. అదేవిధంగా మండలంలోని మాదిపాడు జెడ్పీ పాఠశాలలో ఎనిమిదవ తరగతి విద్యార్థులకు టాబ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ సభ్యుడు మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పేద విద్యార్థులు చదువుల్లో వెనకబడకూడదని, ప్రతి ఒక్కరికీ మంచి విద్యనందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వ పాఠశాలలను నా డు–నేడు ద్వారా కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా నిర్మించటం జరిగిందన్నారు. అదే విధంగా పాఠశాలల విద్యార్థులకు మంచి తరగతి గదులు, తరగతి గదిలో కొత్త బల్లలు, ఇంగ్లిష్ మీడియం విద్య, విద్యార్థులకు ఉచితంగా నోట్ పుస్తకాలు, పాఠ్య పుస్తకాలు, యూనిఫాం, షూస్, మధ్యాహ్న భోజనం, అమ్మఒడి అందించి, ఉత్తమ ఉపాధ్యాయుల ను ఏర్పాటు చేసి, ట్యాబ్‌ల ద్వారా బైజూస్ పాఠాలు చెప్పించడం జరిగిందన్నారు. విద్యార్థులందరూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగపరుచుకుని ఉత్తమ పౌరులుగా ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎంలు అచ్చంపేట హెచ్‌ఎం సీహెచ్ కల్యాణి, పీహెచ్‌సీ చైర్మన్ మొగలి శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు శ్రీనివాసరావు, కరిముల్లా, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



అచ్చంపేట జెడ్పీ పాఠశాలలో విద్యార్థులకు మెటీరియల్ అందజేసిన జెడ్పీటీసీ సభ్యుడు తుమ్మా విజయభాస్కరరెడ్డి

ఆదర్శ విద్యార్థులకు విద్యాజ్యోతి మెటీరియల్

క్రోసూరు: ఏపీ మోడల్ స్కూల్, క్రోసూరులో గురువారం పదవతరగతి విద్యార్థులకు జగనన్న విద్యాజ్యోతి పుస్తకాల పంపిణీ, ఎనిమిదో తరగతి విద్యార్థులకు ట్యాబ్స్‌ను పంపిణీ చేసినట్లు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ మేరీ సుజన్ తెలిపారు. ముఖ్య అతిథిగా ఎంఈఓ గణేష్, జెడ్పీటీసీ సభ్యురాలు షేక్ జమీలగఫూర్, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ జి.దాసు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు అప్పారావు పాల్గొన్నారు. కార్యక్రమానికి పాఠశాల ప్రిన్సిపాల్ అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా జెడ్పీటీసీ సభ్యురాలు జమీలాగఫూర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేసే విద్యా జ్యోతి మెటీరియల్‌ను విద్యార్థులు అందరూ చక్కగా చదివి ఉన్నత మార్కులను సాధించాలని పేర్కొన్నారు. ఎంఈఓ గణేష్ మాట్లాడుతూ అత్యున్నత మార్కులు సాధించే విధంగా విద్యార్థులు సన్నద్ధం కావాలని ఆకాంక్షించారు. పదవ తరగతి విద్యార్థులకు విద్యాజ్యోతి పుస్తకాలను పంపిణీ చేశారు. అనంతరం ఎనిమిదవ తరగతి విద్యార్థులకు ట్యాబ్స్‌లను పంపిణీ చేసారు. ఈకార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు పెద్దమక్కెనలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం

సత్తెనపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష రెండవ దశ వైద్యశిబిరం సత్తెనపల్లి మండలం పెద్దమక్కెన గ్రామంలో శుక్రవారం జరుగుతుందని ఎంపీడీఓ జీవీ సత్యనారాయణ గురువారం తెలిపారు. ఈ వైద్య శిబిరంలో ఫణిదం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంకు చెందిన వైద్యులు పరీక్షలు నిర్వహించి వివిధ రుగ్మతలతో బాధపడే వారికి మందులు పంపిణీ చేస్తారన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర భారీ నీటి పారుదల శాఖ మంత్రి అంబటి రాంబాబు హాజరై శిబిరంను ప్రారంభిస్తారన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు, వలంటీర్లు, ప్రజలు హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

నేడు క్రోసూరులో ..

క్రోసూరు: క్రోసూరు జెడ్పీపాఠశాలలో జగనన్న ఆరోగ్యసురక్ష శిబిరం శుక్రవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ బి.మహేష్ గురువారం తెలిపారు. ఈ కార్యక్రమానికి ఇద్దరు సూపర్‌స్పెషాలిటీ వైద్యులు, పీహెచ్‌సీ వైద్యులు, ఆరోగ్యకేంద్రం వైద్య సిబ్బంది పాల్గొని రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేస్తారని తెలిపారు. ఆధార్ కార్డులు తీసుకొచ్చి నమోదు చేయించుకొని ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని కోరారు.

7న టెన్త్ విద్యార్థులకు ప్రతిభా పరీక్షలు

శావల్యాపురం: పదో తరగతి విద్యార్థులకు ఈ నెల 7న ప్రతిభ పరీక్ష నిర్వహించనున్నట్లు సుచరిత ఏడ్యూకేషనల్ సొసైటీ కరస్పాండెంట్ కేవీఆర్ మోహన్ చందు తెలిపారు. గురువారం స్థానిక శ్రీరామా పబ్లిక్ స్కూల్లో ఆయన మాట్లాడుతూ గంగినేని పౌండేషన్, సుచరిత ఏడ్యుకేషనల్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో ప్రతిభ పరీక్ష స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరుగుతుందన్నారు. పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థుల భయాన్ని పోగొట్టేందుకు ఈ పరీక్ష దోహదపడుతుందన్నారు. గణితం, సైన్స్, సోషల్ సబ్జెక్టులలో డిసెంబరు నెల వరకు జరిగిన సిలబస్ నుంచి 100 మార్కుల మల్టీపుల్ చాయిస్ ప్రశ్న పత్రం ఉంటుందన్నారు. మండల స్థాయిలో బహుమతులు ప్రదానం చేయనున్నట్లు చెప్పారు.

రోడ్డుపై మృతుని బంధువుల ధర్నా

ముప్పాళ్ళ: మినీలారీ ఢీ కొన్న ప్రమాదంలో చనిపోయిన మృతుని కుటుంబానికి న్యాయం చేయాలంటూ మృతదేహాన్ని పోలీస్‌స్టేషన్ వద్ద ఉంచి మృతుని బంధువులు పోలీస్‌స్టేషన్ ముందే ఆందోళనకు దిగిన సంఘటన గురువారం జరిగింది. సంఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. ముప్పాళ్ళ ముస్లిం కాలనీకి చెందిన షేక్ మన్సూర్‌వలి మినీలారీ ఢీకొన్న ప్రమాదంలో మృతి చెందిన సంఘటన తెలిసిందే. ఈ ప్రమాదానికి కారణమైన వ్యక్తిని వదిలిపెట్టారంటూ మృతుని బంధువులు పోలీస్‌స్టేషన్ ముందు బైఠాయించారు. మృతుని కుటుంబానికి న్యాయం చేసేవరకు కదిలేది లేదంటూ ముప్పాళ్ళ పోలీస్‌స్టేషన్ ఎదురుగా సత్తెనపల్లి–నరసరావుపేట ప్రధాన రహదారిపై బైఠాయించి నినాదాలు చేశారు. పెద్దఎత్తున ముస్లిం మహిళలు, యువకులు రావటంతో కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. దాదాపు గంటన్నర గంటల పాటు రోడ్డు పై బైఠాయించటంతో భారీ ఎత్తున ట్రాఫిక్‌జామ్ ఏర్పడింది. రాకపోకలకు తీవ్ర ఇబ్బంది ఏర్పటడంతో ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సమాచారం అందుకున్న సత్తెనపల్లి డీఎస్పీ ఆదినారాయణ పోలీస్‌స్టేషన్‌కు వచ్చి మృతుని బంధువులతో మాట్లాడి ఆందోళనను విరమింపచేశారు. మృతుని కుటుంబానికి నష్టపరిహారంగా రూ.2.5లక్షలు అందించేలా అంగీకరించటంతో ఆందోళనను విరమించారు. అనంతరం ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

మృతుని కుటుంబానికి మంత్రి అంబటి పరామర్శ..

మండల కేంద్రమైన ముప్పాళ్ళ ముస్లిం కాలనీకి చెంది రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త షేక్ మన్సూర్‌వలి కుటుంబాన్ని రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు గురువారం పరామర్శించారు. ముప్పాళ్ళలోని మృతుని గృహానికి వెళ్లి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంఘటన జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. మృతుని కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పారు. ఆయనతో పాటుగా గ్రామ సర్పంచ్ సతీష్, వైఎస్సార్ సీపీ నాయకులు ఎంజేఎం రామలింగారెడ్డి, రెండెద్దుల వెంకటేశ్వరరెడ్డి, శిరిగిరి గోపాలరావు, ఎస్.కె.రహంతుల్లా, మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎస్.కె.హుస్సేన్, రన్‌హుస్సేన్, ఎస్.కె.ఖాశిం, మాబు తదితరులు ఉన్నారు.

పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు



టీకాల నిర్వహణ కార్యక్రమంలో సర్పంచ్

దుర్గి: జాతీయ పశు వ్యాధి నియంత్రణ కార్యక్రమంలో భాగంగా మండలంలోని ముటుకూరు పశు వైద్యశాలలో గురువారం పశువులకు టీకాల నిర్వహణ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక సర్పంచ్ గొంది నాసరయ్య, పశు వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. రైతులనుద్దేశించి ఆయన మాట్లాడుతూ పశు పోషకులు, రైతులు వైద్య శిబిరాన్ని ఉపయోగించుకొని పశువులకు వ్యాధి నిరోధక టీకాలను ఇప్పించాలని రైతులను కోరారు. పశువైద్యురాలు వై.నాగవల్లి మాట్లాడుతూ రైతులు, పశుపోషకులు తప్పకుండా పశువులకు గాలికుంటు వ్యాధి సోకకుండా నివారణ టీకాలు వేయించాలన్నారు. ముందుగా రక్త నమూనాలను సేకరించారు. వైద్యశిబిరంలో 125 గేదెలు, 22 ఆవులకు టీకాలు వేసినట్లు పేర్కొన్నారు. సహాయకులు నాగ సాయినాయక్, గోపాల్ మిత్ర, మరియబాబు, పశుమిత్ర సుధీర్, ట్రైనీలు సూరిబాబు, విజయేంద్ర పాల్గొన్నారు.

రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు

పలుదేవర్లపాడు(ముప్పాళ్ళ): రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. మండలంలోని పలుదేవర్లపాడు గ్రామంలో రూ.కోటి మేర చేపట్టిన పలు అభివృద్ధి పనులను గురువారం ప్రారంభించారు. పేదవాడు సుఖసంతోషాలతో జీవించాలనే తాపత్రయంతో పనిచేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని, ప్రజలకు మెరుగైన పాలన అందించాలనే లక్ష్యంతో రాష్ట్రంలో అనేక విప్లవాత్మక పాలనకు శ్రీకారం చుట్టారన్నారు. సంక్షేమ పథకాలతో పాటుగా గ్రామాల్లో ప్రభుత్వ సేవలకు అవసరమైన నిర్మాణాలు చేపట్టామన్నారు. ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడు మోసపూరిత హామీలతో మోసం చేసేందుకు వస్తున్నాడన్నారు. ఎంతమంది చంద్రబాబులు, పవన్‌కల్యాణ్‌లు కలిసి వచ్చిన విజయం వైఎస్సార్‌సీపీ దేనన్నారు. చిత్తశుద్ధితో పనిచేశామని, మరలా మీ అందరి ఆశీర్వాదం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అందించాలన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో నిర్మించిన గ్రామ సచివాలయం, హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్, రైతుభరోసా కేంద్రంతో పాటుగా వ్యవసాయానికి అవసరమైన విద్యుత్ సరఫరా పనులను ప్రారంభించారు. సర్పంచ్ కంభంపాటి కెజియా రాణి, ఎంపీటీసీ మనికె ఏసమ్మ, మార్కెట్ కమిటీ చైర్మన్ పెండెం బాబురావు, వైస్ చైర్మన్ కళ్లం శివరామిరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు పక్కాల సూరిబాబు, జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షులు అచ్యుత శివప్రసాద్, ఎంజెఎంరామలింగారెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నక్కా శ్రీనివాసరావు, మండల సచివాలయ జేసీఎస్ కన్వీనర్ రెండెద్దుల వెంకటేశ్వరరెడ్డి, యనమాల సింగయ్య, శిరిగిరి గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.



పలుదేవర్లపాడులో గ్రామ సచివాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి అంబటి రాంబాబు

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..!

వైభవంగా సంక్రాంతి ముగ్గుల పోటీలు



సత్తెనపల్లి 28వ వార్డులో ముగ్గులు వేస్తున్న మహిళలు

సత్తెనపల్లి: సంక్రాంతి సంబరాలను పురస్కరించుకొని రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి అంబటి రాంబాబు ఆధ్వర్యంలో వైఎస్సార్ సంక్రాంతి గ్రామీణ ముగ్గుల పోటీలు గురువారం పట్టణంలోని 28వ వార్డులో నిర్వహించారు. మహిళలు ఉత్సాహంగా హాజరై వివిధ రంగులతో కూడిన రంగవల్లులు తీర్చిదిద్దారు. మొత్తం 92 మంది మహిళలు ముగ్గుల పోటీల్లో పాల్గొన్నారు. వార్డులోని సీసీ రోడ్లు రంగవల్లులతో నిండిపోయాయి. ముగ్గులను వార్డు కౌన్సిలర్ తాహెరున్నీసా పరిశీలించారు. వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ గీతాహసంతి నేతృత్వంలో న్యాయ నిర్ణేతలు ముగ్గులను పరిశీలించి విజేతలను ఎంపిక చేశారు. వార్డు స్థాయి ముగ్గుల పోటీల్లో తల్లం గురుప్రసన్నలక్ష్మీ(ప్రథమస్థానం), బాదం హారిక (ద్వితీయస్థానం), తల్లం నాగ రాజకుమారి(తృతీయస్థానం), ముసుగు తిరుపతమ్మ(నాలుగో స్థానం), ఎం.పద్మావతి (5వ స్థానం) కైవసం చేసుకున్నారు. నాయకులు షేక్ మొహమ్మద్ గని, చామర్తి ఆంజనేయులు (చిన్నా), గన్ సైదా, చిన్న గన్‌సైదా, చిన్న నాసరయ్య, వలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

రాజుపాలెం: మండలంలోని అంచులవారిపాలెంలో వైఎస్సార్ సంక్రాంతి గ్రామీణ ముగ్గుల పోటీలు అట్టహాసంగా జరిగాయి. ముగ్గుల పోటీలలో 328 మంది మహిళలు పాల్గొని రంగవల్లులు దిద్దారు. గురువారం రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు ముఖ్య అతిథిగా పాల్గొని విజేతలను ప్రకటించారు. మొదటి బహుమతి వేపూరి కోమలి, ద్వితీయ బహుమతి అంచుల వీరకుమారి, తృతీయ బహుమతి తోట సరితలు, కన్సోలేషన్ బహుమతులను ప్రకటించారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ వేపూరి శ్రీనివాసరావు, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ మర్రి సుబ్బారెడ్డి, సర్పంచ్ అంచుల రామాంజనేయులు, జెడ్పీటీసీ దొంతిరెడ్డి సునీత శ్రీనివాసరెడ్డి, వైస్ ఎంపీపీ హరి సూరమ్మ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



అంచులవారిపాలెంలో ముగ్గుల పోటీల విజేతలను ప్రకటిస్తున్న మంత్రి అంబటి రాంబాబు

దేచవరంలో..

నకరికల్లు: దేచవరం గ్రామంలో పార్టీ మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ముగ్గులపోటీలు నిర్వహించారు. గ్రామంలోని కల్యాణమండపం ప్రాంగణంలో నిర్వహించిన పోటీలకు మహిళలు పెద్దసంఖ్యలో తరలివచ్చి, రంగవల్లులు తీర్చిదిద్దారు. న్యాయనిర్ణేతలు ముగ్గులను తిలకించి ఐదుగురు విజేతలను ఎంపికచేశారు. మొదటిస్థానంలో వేముల నాగసందిని, రెండోస్థానంలో కొండా విజయలక్ష్మి, మూడవస్థానంలో కొత్తమాసు పూర్ణిమ, నాలుగోస్థానంలో భవనం ఉదయలక్ష్మి, ఐదోస్థానంలో దొడ్డా శ్రీలక్ష్మిలు ఎంపికయ్యారు. ముగ్గులపోటీలో పాల్గొన్న వారందరికీ ప్రోత్సాహకబహుమతులు అందజేశారు. ఉపసర్పంచ్ భవనం రమణారెడ్డి, మాజీ సొసైటీ అధ్యక్షుడు దొండేటి కోటిరెడ్డి, వీఆర్వో పి.వి.కోటేశ్వరరావు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

ఈవీఎంలపై ఓటర్లకు అవగాహన

బెల్లంకొండ: ఎన్నికలలో వినియోగించే ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లపై గ్రామాలలో రెవెన్యూ సిబ్బందితో అవగహన కల్పిస్తున్నట్లు తహసీల్దార్ క్షమారాణి తెలిపారు. గురువారం మండలంలోని కొత్తపాలెం, గంగిరెడ్డిపాలెం గ్రామాలలో ఓటర్లతో ఈవీఎంలలో ఓటు వేసే విధానాన్ని డెప్యూటీ తహసీల్దార్ నిర్మల ఓటర్లకు వివరించారు. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈవీఎంలపై మండలంలోని అన్నీ గ్రామాలలో అవగాహన కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు. ఆర్ఐలు జిలాని, వీఆర్వోలు వెంకయ్య, నాగేశ్వరరావు, శాస్త్రి, లక్ష్మీనారాయణ, జేఏలు విజయ్, నాయక్ తదితరులు పాల్గొన్నారు.



కొత్తపాలెంలో ఈవీఎంలపై అవగాహన కల్పిస్తున్న డీటీ నిర్మల

ఏఎన్‌యూ క్రికెట్ జట్టుకు కేబీఆర్ కళాశాల విద్యార్థి ఎంపిక



నరసరావుపేట ఈస్ట్: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం క్రికెట్ జట్టుకు కాసు బ్రహ్మానందరెడ్డి డిగ్రీ కళాశాల విద్యార్థి షేక్.మహ్మద్ తౌఫిక్ ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ సీహెచ్.వి.నాగిరెడ్డి గురువారం తెలిపారు. వర్సిటీ క్రీడా మైదానంలో డిసెంబర్ 28 నుంచి ఈ నెల 3వ తేదీ వరకు నిర్వహించిన జట్టు ఎంపికలో తౌఫిక్ ప్రతిభ కనపరిచారన్నారు. ఈ నెల 7 నుంచి చెన్నైలోని హిందుస్థాన్ ఇంజినీరింగ్ కళాశాలలో జరగనున్న సౌత్ జోన్ అంతర్ విశ్వవిద్యాలయాల క్రికెట్ టోర్నమెంట్‌లో తౌఫిక్ ఏఎన్‌యూ జట్టు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. తౌఫిక్‌ను కళాశాల కార్యదర్శి, గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి, ప్రిన్సిపల్ నాగిరెడ్డి, వైస్ ప్రిన్సిపల్ ఎ.వెంకటశివ, వ్యాయామ అధ్యాపకుడు ఎం.వి.సీల్, అధ్యాపకులు అభినందించారు.